క్లుప్తంగా

చిత్రకళలో విద్యార్థుల ప్రతిభ



పతకాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, డ్రాయింగ్‌మాస్టర్

నందికొట్కూరు: చిత్ర కళలో పట్టణంలోని స్కాలర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారని డైరెక్టర్ కాలూరి శివప్రసాద్ సోమవారం తెలిపారు. చోడవరం చిత్ర కళా నిలయం వారు నిర్వహించిన ఆల్ ఇండియా కాంపిటిషన్‌లో తన పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారన్నారు. వీరికి నవంబర్ 4న చోడవరంలో పతకాలు అందజేస్తారని వివరించారు. డ్రాయింగ్‌మాస్టర్ శ్రీనును, విద్యార్థులను అభినందించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయండి

ఆత్మకూరు : మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నుంచి నవంబర్ చివరి వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, అన్ని కార్యక్రమాలకు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వార్డు కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది హాజరవుతారని చెప్పారు. మంగళవారం ప్రారంభ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పాఠశాలకు ఎల్ఈడీ బల్బులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వి.గణేష్, పి.రాగన్న, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామలింగేశ్వరరెడ్డి రూ.20,250 విలువ చేసే 9 ఎల్ఈడీ బల్బులను విరాళంగా అందజేసినట్లు హెచ్ఎం మధుసూదన్‌రావు సోమవారం తెలిపారు. ఖోఖో, కబడ్డీ, క్రీడాకారులు మైదానంలో ఆడుకునేందుకు ఈ బల్బులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను, రిటైర్డ్ ఉపాధ్యాయుడుని పాఠశాల సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీ కృష్ణ, క్రీడాభిమాని పీతాంబరరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

ఆత్మకూరు: స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మంగళవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఆత్మకూరు పట్టణంలోని పాత గ్రామపంచాయతీ వద్ద నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత శ్రీమహానందీశ్వరస్వామివారికి సోమవారం రాత్రి పల్లకీ ఉత్సవం మహావైభవంగా జరిగింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకరఅవధాని, అర్చకులు స్వామిఅమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యహవాచనం, అలంకార పూజ, హారతులు చేపట్టి అనంతరం నాలుగుదిక్కుల్లో బలిహరణ పూజలు జరిపారు. ఆలయ ప్రాకారంలో స్వామిఅమ్మవార్ల పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది.

ఏబీవీపీ నాయకుల నిరసన

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ చర్యలను నిరసిస్తూ ఏబీవీపీ కళామంచి జిల్లా కన్వీనర్ నాగరాజు విద్యార్థులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం పాఠశాల గేట్ బయట బైఠాయించి ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు తిరిగి పాఠశాలలకు చేరుకుంటున్నారని, అయితే ప్రిన్సిపాల్ రమణమ్మ విద్యార్థినులను లోపలికి అనుమతించకుండా మండుటెండలో గేట్ బయటనే పెట్టడం బాధాకరమన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రమణమ్మను సంప్రదించగా పాఠశాలలో ఇంటర్నల్ పరీక్షలు జరుగుతున్నందున లోపలికి అనుమతించలేదన్నారు. పరీక్షల అనంతరం అందరిని లోపలికి అనుమతించామని చెప్పారు.

నెరవేరిన ఏళ్లనాటి కల

- 36 ఏళ్ల తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం
- రూ.1.85కోట్లతో నిర్మాణం పూర్తి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఆధునిక హంగులతో సకల సౌకర్యాలు
- వచ్చే నెలలో ప్రారంభించే అవకాశం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జూపాడుబంగ్లా నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

జూపాడుబంగ్లా: ఎన్ని ప్రభుత్వాలు మారినా మండల కేంద్రంలో ఆసుపత్రికి నూతనభవనం నిర్మించడంపై దృష్టి సారించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వైద్యం, విద్యకు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, జగనన్న ఆరోగ్యసురక్ష, ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్ ఏర్పాటుచేసి ప్రజలకు స్వగ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందేలాచేస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. ఈ క్రమంలోనే రూ.1.85కోట్ల వ్యయంతో జూపాడుబంగ్లాలో ఆరు పడకలతో ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మించారు. దీనిని త్వరలోనే ప్రారంభించనున్నారు. దీంతో ఏన్నో ఏళ్ల కల నెరవేరడంతో మండల ప్రజలు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాలుగా ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు..

1985లో జూపాడుబంగ్లా మండల కేంద్రంగా ఆవిర్భవించగా.. నాటి నుంచి నేటివరకు ఆరోగ్యకేంద్రానికి సొంతభవనం లేదు. ఇరుకైన ఉపఖజానా భవనంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి పదిమంది రోగులు వస్తే వారిని పడుకోబెట్టి చికిత్సలు చేయాలన్నా, సెలైన్‌బాటిల్ ఎక్కించాలన్నా, సరైన వసతుల్లేక సిబ్బంది సతమతం అవుతున్నారు. కనీసం సిబ్బంది కూర్చునేందుకు, భోజనాలు చేసేందుకు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు సుఖప్రసవం పొందాలన్నా, కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాలన్నా నందికొట్కూరు, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగుతీయాల్సిన పరిస్థితి.

నూతన భవనంలో సకల సౌకర్యాలు

మండల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ ప్రభుత్వం జూపాడుబంగ్లాలో నూతన ఆసుపత్రి భవననిర్మాణం నిమిత్తం రూ.1.85,75,000 నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం భవననిర్మాణం పనులు పూర్తికావడంతో తుది మెరుగులు దిద్దుకుంటోంది. వచ్చే నెలాఖరులోగా ఆసుపత్రి నూతన భవనాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి. ఆరు పడకలతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణుకు సుఖప్రసవాలు చేసేందుకు అన్ని సౌకర్యాలు సమకూర్చారని వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే రోగులకు బీపీ, షుగర్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, హెచ్‌బీ, రక్తపరీక్షలు వంటి 14 రకాల పరీక్షలు నిర్వహించటంతో పాటు రోగులకు మెరుగైన వైద్యం అందించే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కొత్త భవనంలో మెరుగైన వైద్యం



జూపాడుబంగ్లాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సొంత భవనంలేక ప్రస్తుత మున్న ఇరుకైన భవనంలో ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం పీహెచ్‌సీకి ప్రభుత్వం సొంతభవనం నిర్మిస్తుంది. భవన నిర్మాణం పూర్తైతే ఇక్కడే ప్రసవాలు, ఆపరేషన్లు చేసే అవకాశం ఉంటుంది. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు సౌలభ్యంగా ఉంటుంది.

– డాక్టర్. గంగాధర్, పీహెచ్‌సీ, జూపాడుబంగ్లా

ఇరుకైన గదుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సొంత భవనం లేక పోవడంతో ఇరుకైన గదుల్లో ఆసుపత్రిని నిర్వహిస్తున్నాం. ఇద్దరు మించి ఎక్కువ మంది రోగులు వస్తే వారికి సెలైన్ ఎక్కించాలన్నా, చికిత్సలు నిర్వహించాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. ప్రస్తుతం నూతన భవననిర్మాణం జరుగుతుండటం సంతోషంగా ఉంది. భవననిర్మాణం త్వరగా పూర్తైతే అందులో రోగులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించవచ్చు.

– మహాబ్, సీహెచ్‌ఓ, జూపాడుబంగ్లా

నేడు సర్వసభ్య సమావేశం

మహానంది: బుక్కాపురంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి సోమవారం తెలిపారు. మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన సమావేశం ఉంటుందని, అధికారులు నివేదికలతో హాజరుకావాలన్నారు.

గిరిజనులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): గిరిజనులకు పక్కా ఇళ్లు ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. గిరిజనులకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఇళ్లను నిర్మించుకొనే స్థోమత లేదని, ప్రభుత్వం కట్టించి ఇచ్చేలా చర్యలు చేపట్టలంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు జీపీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): పేద ముస్లిం యువతుల వివాహాలకు అంజుమాన్ సంస్థ రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేస్తుందని, ఇందుకు నిరుపేదల దరఖాస్తు చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 27వ తేదీ నాటికి వధూవరుల ఫొటోలు, ఆధార్‌కార్డులతో కూడిన దరఖాస్తులను నంద్యాల బస్టాండ్ వద్దనున్న అంజుమాన్ షాదీఖానాలో అందజేయాలని సూచించారు. వధువు నంద్యాలకు చెంది 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తుమ్మలూరు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం బాలరాజు సోమవారం తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్ 17, 14 విభాగాల్లో ఈ నెల 26న నంద్యాల జిల్లా కేంద్రంలోని కేఎస్ఎం మున్సిపల్ హై స్కూలు క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. బాల్ బ్యాడ్మింటన్ అండర్ -17 విభాగంలో ఉమేష్‌చంద్ర, అండర్- 14లో పావని, మహాలక్ష్మి బ్యాడ్మింటన్, రోప్ స్కిప్పింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సచివాలయంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి

నందికొట్కూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మారుతి నగర్ -7, సాయిబాబా పేట -13, హాజీనగర్ -14, సచివాలయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. సమస్యలపై వచ్చిన ప్రజలతో ప్రేమగా మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని, పాలన సులభతరం చేసేందుకే సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్లు లాలు ప్రసాద్, సమీరా బాను, అబ్దుల్‌రవూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, జేసీఎస్ కన్వీనర్ అబూబక్కర్, నాయకుడు ఉస్మాన్‌బేగ్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం గోశాల నిర్వహణపై ప్రశంసలు



గో సంరక్షణ శాలలో ఈఓ ,జీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో మల్లమ్మ కన్నీరు ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గో సంరక్షణశాల నిర్వహణపై అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హైదరాబాద్ బాలకృష్ణ గురుస్వామి ప్రశంసలు కురిపించారు. సోమవారం ఈఓ పెద్దిరాజుతో కలిసి గోశాలను సందర్శించారు. గోశాలలో దేవస్థానం గో సంరక్షణ కు తీసుకుంటున్న చర్యలపై ఈఓను అడిగి తెలుసుకున్నారు. గోవులకు వేస్తున్న గడ్డి, దాణా, కాలానుగుణంగా వేస్తున్న టీకా మందుల వివరాలను, ఇతర వైద్య సేవలను ఈఓ ఆయనకు వివరించారు. అలాగే గోమయం ద్వారా తయారు చేస్తున్న విభూతి, గో ఆర్క్, ధూప్ స్టిక్స్, యాంటీరేడియేషన్ స్టిక్కర్స్, హోమ పిడకలు తదితర గో ఉత్పత్తులను తయారు చేసి ప్రత్యేక కౌంటర్ ద్వారా భక్తులకు విక్రయిస్తున్నామని తెలియజేశారు. దీనిపై జరిగిన ఆయన శ్రీశైలదేవస్థానం వారు గో సంరక్షణశాలను ఎంతో ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నారని సంతృప్తిని వ్యక్తం చేశారు. అఖిల భారత గో సేవా ఫౌండేషన్ తరపున శ్రీశైలం గోశాల నిర్వహణకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ విభాగ పర్యవేక్షకులు శ్రీనివాసులు , గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సౌకర్యాలు



మాట్లాడుతున్న మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్

ఆత్మకూరు: చెంచుగూడేల్లోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు కల్పిస్తామని ఆత్మకూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, వార్డు కౌన్సిలర్ విజయచౌదరి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం ఆర్డీటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అందిస్తున్న వైద్య సేవలు అబ్బురపరుస్తాయని, పేదవారికి ఇంటి వద్దకే వైద్యం అందుతున్నాయన్నారు. అనంతరం గిరిజనులకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాయుడు, వార్డు కౌన్సిలర్ ప్రకాష్‌రావు, మోతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు రషీద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చూపాలి



విజేతలకు షీల్డ్ అందజేసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(న్యూటౌన్): క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏడవ జిల్లా స్థాయి త్రోబాల్ క్రీడ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, చైర్మన్ దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు రవికృష్ణ, చిన్నపురెడ్డి హాజరయ్యారు. దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి 108 టీములు తలపడ్డాయన్నారు. పోటీల్లో విజ్ఞాన పీఠం కర్నూలు బాలుర జట్టు ప్రథమ స్థానం, గురురాజ ఇంగ్లిష్ మీడియం ద్వితీయ స్థానం, గుడ్‌షెప్పర్డ్ స్కూల్, భాగ్యనగరం జిల్లా పరిషత్ హైస్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. జిల్లా క్రీడా ప్రతినిధులు ఏపీ రెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజు, దివాకర్, శ్రీధర్, విష్ణు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సాగునీటి హక్కులపై అవగాహన అవసరం

నంద్యాల(సెంట్రల్): సాగునీటి హక్కులపై సమగ్ర అవగాహనతోనే సీమ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సమితి కార్యాలయంలో 'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, నిర్వహణ విధానాలపై సామాన్యుడికి సైతం అర్థమయ్యేలా పుస్తకాన్ని రూపొందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణా జలాల పునఃపంపిణీపై అక్టోబర్ 6న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌తో సీమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. పుస్తకంలోని అంశాల్ని గత మూడు వారాలుగా సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేశామని, ప్రతి ఒక్కరూ ఈ అంశాల్ని తెలుసుకుని చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. సమితి ఉపాధ్యక్షుడు వై.ఎన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, సౌదాసాగర్ ఖాసీం మియా, రామకృష్ణారెడ్డి, కొమ్మా శ్రీహరి, ఏరువ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో భూ సమస్యలు పరిష్కరించాలని ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను లిఖితపూర్వకంగా స్పందనలో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

కొత్తపల్లి: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దుద్యాల గ్రామం నుంచి భూమి ఆన్‌లైన్ సమస్యపై 1, గువ్వలకుంట్ల గ్రామం నుంచి వరిచేలను అడవిపందులు తొక్కి నాశనం చేశాయని నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని 3 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. వాటిని పరిష్కరించాలని సంబధిత శాఖల అధికారులకు అదేశాలిచ్చామని చెప్పారు.

కరువు మండలంగా ప్రకటించాలి

నందికొట్కూరు రూరల్ : మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, చిన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది : మహానంది ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం వుంటుందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీకామేశ్వరీ , మహానందీశ్వరస్వామివార్ల ఆలయాలతో పాటు కోదండ రామాలయం, అంజనేయ స్వామి ఆలయం , అన్నదాన విభాగం కేంద్రాల్లోని హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు. ఆలయ సిబ్బంది ప్రతి ఒక్కరు హాజరుకావాలని సూచించారు.

చెత్త దిబ్బలను తొలగించండి

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రం సున్నిపెంట గ్రామంలో చెత్తదిబ్బలు తొలగించాలని బీజేపీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నీరు కట్టు దర్గాస్వామి తహసీల్దార్ రాజేంద్రసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ఏ ప్రాంతంలో చూసినా చెత్త దిబ్బలు పెరిగిపోయాయని, పంచాయితీ అధికారులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగభూషణ్

కొత్తపల్లి: ప్రశాంతతకు మారుపేరైన గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఎస్ఐ హుస్సేన్ బాషా ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. నాటుసారా విక్రయించే, అక్రమ మద్యం విక్రయించే పాత అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఇందులో భాగంగానే నెంబర్‌ప్లేట్లులేని, సరైన రికార్డులు లేని 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులకు, యువతకు చెడుఅలవాట్లు, ఇతర అసాంఘిక కార్యకలపాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పాలెంచెరువు గూడెం, నల్లమల అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై సోదాలు నిర్వహించారు. సోదాలలో పట్టుబడిన మోటారు సైకిళ్లకు సంబంధించిన రికార్డులను చూపించి తీసుకెళ్లాలని సూచించారు. పాములపాడు ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా అని జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. సోమవారం పగిడ్యాల సచివాలయం- 3 పరిధిలోని సంకిరేణిపల్లె, బీరవోలు, ఆంజనేయనగర్ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో కొనసాగిన ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌నకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జెడ్పీటీసీ మాట్లాడుతూ నెల రోజులుగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు. ఒక్కో వైద్య శిబిరంలో 800 మందికి పైగా పేదలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవడం విశేషమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న పంటలో సోమవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించారు. పొలంలో 5 గీ5 కొలతల ప్రకారం దిగుబడి లెక్కిస్తే 13.80కిలోలు రావాల్సి ఉండగా, కేవలం 6కిలోలలోపు మాత్రమే దిగుబడి వచ్చినట్లు ఆర్‌డీఓ కార్యాలయ ఉపగణాంకాధికారి ఎం.నాగరాజు, జూపాడుబంగ్లా ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున సాగుచేసిన పంటలలో దిగుబడి భారీగా తగ్గినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా పంటల ఇన్స్రెన్స్ తరుపున సంజయ్, మునావర్, వీఆర్వో బాలకృష్ణ, సచివాలయ వీహెచ్‌ఏ వెంకటేష్, వీఆర్‌ఏలు ఆంజనేయులు, మాణిక్యం పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో పత్తిపంటను సాగుచేసుకున్న రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీ.సీ.ఐ) వారు కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారన్నారు. 2023-24 సీజన్‌లో పండించిన పత్తి పంటలను క్వింటా బన్ని-బ్రహ్మపింజ పత్తి పొడువుగింజ రూ.7,020, పొట్టిగింజ రూ.6,620కు నిర్ణయించిందని తెలపారు. వీటిని కొనుగోలు చేసేందుకు నంద్యాల పట్టణంలో జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని వివరించారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తం జిరాక్స్‌లు తీసుకువచ్చి ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేయించుకొని టోకెన్ పొందిన తర్వాత మాత్రమే పత్తిని జిన్నింగ్ మిల్లులకు తీసుకెళ్లాలని సూచించారు. నంద్యాల పట్టణంలో శ్రీ మురారి పవన్ అగ్రోటెక్, విజయ మిల్క్ డెయిరీ వెనుక, పొన్నాపురం, మారం లక్ష్మీనారాయణ కాటన్ ఇండస్ట్రీ నూనెపల్లి, ఏఎన్‌సీ అగ్రో మిల్స్ నూనెపల్లి నంద్యాల వారి వద్దకు తీసుకు వెళ్లాలన్నారు. పత్తిని బాగా ఆరబెట్టి శుభ్రపరిచి తీసుకురావాలని తెలిపారు. తేమశాతం 8గా ఉండాలని లేకపోతే ఒక్కశాతానికి రూ.70-20 పైసలు తగ్గింపు ఉంటుదని వివరించారు. పత్తిగింజ పొడవు 29.50 ఎమ్ఎమ్ నుంచి 30.50 ఎమ్ఎమ్ ఉండాలని, మైక్రోనెయిర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలని చెప్పారు. వర్షంలో తడిసిన పత్తిని తీసుకోరని, దుమ్మూధూళి, చెత్తా, చెదారము లేకుండా చూసుకోవాలని సూచించారు.

సార్.. మాస్థలం ఆన్‌లైన్ చేయించుకున్నాడు

- ఇంటి స్థలాలు పొలాలుగా ఆన్‌లైన్‌లో నమోదు
- బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్న వైనం
- 'స్పందన'లో ఫిర్యాదు చేసిన బాధితులు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

పాములపాడు: తమ ఇంటి స్థలాలను ఓ వ్యక్తి అక్రమంగా పొలాలుగా ఆన్‌లైన్ చేయించుకొని, బ్యాంకులో రుణాలు తీసుకున్నాడని, సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో బాధితులు మౌలాలి, ఖాజామొహిద్దిన్, పహిల్వాన్ అర్జీలు ఇచ్చారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మిట్టకందాల గ్రామంలో 320 సర్వే నెంబరులో 58 సెంట్ల స్థలంలో 20 మందికి పైగా ఇంటినిర్మాణాలు చేపట్టి నివాసముంటున్నారు. కాగా మరి కొందరు కళ్లాలుగా వినియోగించుకుంటున్నారు. నివాసాలున్న వారి పెద్దలు దాదాపు 50 సంవత్సరాల క్రితం స్థలం కొనుగోలు చేసి రిజిష్టర్లు చేయించుకున్నారు. అయితే గ్రామానికి చెందిన మిద్యపోగు అరుణమ్మ భర్త బుడ్డన్న పేరిట వారసత్వంగా సంక్రమించినట్లు 1.6 ఎకరాలు, అలాగే ఎల్. రాజారత్నం తండ్రి రామన్న అనే మరో వ్యక్తి పేరిట 1.6ఎకరాల భూమి పిత్రార్జితం అని 2013వ సంవత్సరంలో అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. అప్పటి నుంచి బ్యాంకుల్లో క్రాప్ లోన్ పొందుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పొలాలుగా నమోదు చేయించుకున్న వారి పూర్వీకుల పేర్లు రికార్డుల్లో ఎక్కడా లేవని, మిద్యపోగు బుడ్డన్న రేషన్‌డీలర్ కావడంతో అప్పట్లో అధికారులను మభ్యపెట్టి సులువుగా తమ ఇంటి స్థలాలను పొలాలుగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని వాపోయారు.

విషయం వెలుగులోకి వచ్చింది ఇలా..

చిన్న యాకోబు తన ఇంటిపై ఇంటి లోన్ తీసుకునేందుకు వెళ్లగా అధికారులు వెరిఫికేషన్ చేశారు. దీంతో అసలు గుట్టు బయట పడింది. వారు నివాసముంటున్న ఇంటి స్థలాలు రమణమ్మ, రాజారత్నంల పేరిట ఆన్‌లైన్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పడంతో ఆ ఇంటి యజమానులు నివ్వెర పోయారు. ఈ విషయం 7 నెలల క్రితం జరిగింది. అప్పటి నుంచి బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో కూడా అర్జీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని వాపోతూ మరో సారి అర్జీ ఇచ్చేందుకు వచ్చేందుకు వచ్చామని చెబుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

కలెక్టరు కార్యాలయానికి పంపించాం

బాధితుల నుంచి అర్జీతీసుకున్నాము. గతంలో పని చేసిన అధికారుల పొరపాటు వల్ల ఇంటి యజమానుల స్థలాలు వేరే వారి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయి. తొలగించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టరు వారి కార్యాలయానికి నివేదిక పంపడం జరిగింది. అక్కడి నుంచి లెటరు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– పఠాన్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్